క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అధిక శ్రావణ మాసం పాడ్యమి పురస్కరించుకుని అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్న సమారాధన చేశారు.

రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: కాతేరు నుంచి సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులకు సూచించారు. చినకొండేపూడిలో మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ మధుసూదనరావు, కాంట్రాక్టర్‌తో నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులపై ఆయన సమీక్షించారు. పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. నాలుగు నెలల్లో నాలుగు లైన్ల రోడ్డు పూర్తి చేయాలన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎంతో మేలు

బిక్కవోలు: సేంద్రియ వ్యవసాయంతో ఎంతో మేలు జరుగుతుందని సేంద్రియ వ్యవసాయ సబ్‌డివిజనల్ యాంకర్ సీహెచ్‌వీ సత్యవతి అన్నారు. మంగళవారం మోఖ్లారు గ్రామంలో ఆమె మాట్లాడుతూ బీజామృతంతో నారు శుద్ధి చేసి కొనలు తుంచి వరి నాట్లు జరిపిస్తున్నామన్నారు. గ్రామంలో ఇప్పటికే 100 ఎకరాల్లో సేంద్రియ సాగు జరుగుతుందని చెప్పారు. రైతులకు మరింత అవగాహన కల్పించి సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంచుతామన్నారు. కార్యక్రమంలో సేంద్రియ వ్యవసాయ సిబ్బంది మర్రి మల్లేశ్వరి, జల్లి లావణ్య, గంగమల శ్రీలక్ష్మి, ముమ్మిడి సత్యశ్రీ పాల్గొన్నారు.

209 మందికి వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు చైతన్య, గాయత్రి

పెదపూడి: జి.మామిడాడలోని ఎస్సీ పేటలో డాక్టర్ బి.ప్రతాప్ సంస్మరణార్థం వారి కుటుంబ సభ్యులు చైతన్య నర్సింగ్ హోమ్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు చైతన్య, గాయత్రి 209 మంది రోగులను పరీక్షించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చైతన్య సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మండ రాజారెడ్డి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, ఆర్ఏఆర్‌కే చౌదరి పాల్గొన్నారు.

ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పొద్దు


బిక్కవోలు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

బిక్కవోలు: సైబర్ నేరగాళ్లు కొత్త మార్గాల్లో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు తమ ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పొద్దని సీఐ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా బిక్కవోలు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల పేర్లతో ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌లో ప్రభుత్వ అధికారులుగా పరిచయం చేసుకుని ఓటీపీ వివరాలు అడిగి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు మాయం చేస్తున్నారని చెప్పారు. అలాగే లింక్ ఓపెన్‌చేస్తే ఉచిత గిఫ్ట్‌లు వస్తాయంటూ నమ్మబలికే ప్రకటనలు చూసి మోసపోవొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

వర్షంతో హర్షం

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నారుమడుల ఎదుగుదలకు, ఆకుతీతకు, దమ్ము చేయడానికి, నాట్లు వేయడానికి వీలుగా మడులలో నీరు చేరింది. ఇప్పటికే వరినాట్లు వేసిన చేలకు ఈ వర్షం ఊపిరిపోసిందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మెట్టలో వరినాట్లు ముమ్మరంగా సాగనున్నాయి.

మెట్టకు ఊపిరిపోసిన వర్షం


శ్రీరంగపట్నంలో వరి నారుమడి


బూరుగుపూడిలో దమ్ము చేస్తున్న రైతు

- అన్నదాతల హర్షం
- జోరందుకోనున్న సాగు పనులు

మధురపూడి: మెట్ట ప్రాంతంలో వరిసాగుకు వర్షం ఊపిరి పోసింది. వేసవి దుక్కుల తర్వాత వర్షాల కోసం ఎదురుచూసిన అన్నదాతల ఆశలు చిగురించాయి. జూన్‌లో ప్రారంభం కావల్సిన ఖరీఫ్ సీజన్ సాగు.. కాలం కలసిరాక ఆలస్యమైంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాగుకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యాయి. ప్రస్తుతం వర్షం కురుస్తుడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలోని 3 మండలాల్లో సాధారణ సాగువిస్తీర్ణం 16,698 హెక్టార్లుగా ఉంది. దీనిలో నూరుశాతం నారుమడులు వేయగా, 45 శాతం వరినాట్లు పూర్తయ్యాయి.

సాగువివరాలు (హెక్టార్లలో)

మండలం	సాగు విస్తీర్ణం	నారుమడి	వరినాట్లు
కోరుకొండ	6,046	302	600
రాజానగరం	4,983	249	1,200
సీతానగరం	5,669	281	2,500
మొత్తం	16,698	832	5,940

జోరుగా సాగు

వర్షాలతో మెట్టప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు జోరుగా సాగుతోంది. ఇప్పటికే బోర్లు, ఇతర సాగునీటి సదుపాయం కలిగిన ప్రాంతాల్లో వరినాట్లు వేశారు. నారుమడులు నూరుశాతం పూర్తవ్వగా, నాట్లు జరుగుతున్నాయి. సీతానగరం మండలంలో అత్యధికంగా వరినాట్లు వేశారు. కోరుకొండ మండలంలో 550 హెక్టార్ల విస్తీర్ణంలో, రాజానగరంలో 2,209 హెక్టార్ల విస్తీర్ణంలో జరిగాయి. కోరుకొండ మండలంలోని మెట్ట ప్రాంతమైన గాదరాడ, కణుపూరు, రాజవరం, బొల్లెద్దుపాలెం, కోటికేశవరం, గరగలంపాలెం గ్రామాల్లో రైతన్నలు పొలం పనులకు సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఎంటీయూ 1,318 విత్తనాలు వినియోస్తున్నారు. బీపీటీ 5204, పీఎల్ఏ 1,100, ఎంటీయూ 1,064, 1,061, రకాలను కూడా సాగుచేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు నిర్వహించిన భూసార పరీక్షల ఆధారంగా, సాగు సూచనలు చేశారు.

సూచనలు పాటించాలి



ఖరీఫ్ సాగులో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చు. దమ్ముల్లో భాస్వరం వేసుకోవడంతో వల్ల వేరువ్యవస్థ పటిష్ఠంగా ఉంటుంది. వర్షాలకు నేలరాలకుండా నిలబడుతుంది. రైతులు స్థానిక వ్యవసాయ అసిస్టెంట్ల సూచనలతో ముందుకెళ్లాలి.
– ఏ.గౌరీదేవి, కోరుకొండ మండల వ్యవసాయ అధికారి

వర్షం ఎంతో ఉపయోగం



ప్రస్తుతం కురుస్తున్న వర్షం ఖరీఫ్ సాగుకు ఉపయోగంగా ఉంది. వేసవి దుక్కుల తర్వాత చాలా రోజులుగా సాగు ప్రయత్నాలు జరగలేదు. విపరీతమైన ఎండలుండటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే ప్రస్తుతం అనుకూల పరిస్థితులతో సాగుకు సిద్ధమవుతున్నాం.
– శనివారపు పోతురాజు, రైతు, గాడాల

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి మంచి ప్రోత్సాహమిస్తోంది. భూసార పరీక్షలు నుంచి సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వరకూ అన్నీ తెలియజేస్తోంది. ఈ సంవత్సరం కోరుకొండ మండలంలో వర్షాలు ఆలస్యం కావడంతో నాట్లు లేటుగా జరుగుతున్నాయి.
– బుడ్డిగ సత్తిబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్, రైతు, బూరుగుపూడి

వలంటీర్లకు వందనం

చేదోడు వాదోడు


బూరుగుపూడిలో అప్పయమ్మ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ సత్యవతి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి గ్రామానికి చెందిన దొడ్డి అప్పయ్యమ్మకు ఆ ప్రాంత వలంటీర్ ఎస్.సత్యవతి చేదోడు వాదోడుగా ఉంటోంది. ఆమెకు అన్ని విధాలా సహాయపడుతోంది. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తోంది. కరోనా సమయంలో ఇంటింటికీ తిరుగుతు బాధితులకు మందులు, నిత్యావసరాలు పంపిణీ చేసింది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ సక్రమంగా అందజేస్తోంది. గతంలో పింఛన్ తీసుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లమని, వలంటీర్ వచ్చాక ఆ బాధ తప్పిందని దొడ్డి అప్పయమ్మ ఆనందం వ్యక్తం చేసింది.

సేవలు అభినందనీయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణరెడ్డికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జీవన్‌జ్యోతి

పెదపూడి: పెదపూడి మండలం జి.మామిడాడకు చెందిన కర్రి సత్యనారాయణరెడ్డి మూడు నెలల క్రితం అనారోగ్యంతో బిక్కవోలు మండలం పందలపాకలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. అదే సమయంలో పింఛన్ ఇవ్వాల్సి ఉండడంతో వలంటీర్ జీవనజ్యోతి ఆసుపత్రికి వెళ్లి వేలిముద్ర తీసుకుని సాయం అందజేశారు. ఆర్థికంగా చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో వలంటీర్ జీవనజ్యోతి పింఛను తీసుకొచ్చి ఇచ్చిందని సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కరోనా సమయంలోనూ తన కుటుంబ సభ్యులకు కరోనా వైరస్ సోకినప్పుడు పాలు, తాగునీరు, కూరగాయలు తదితర నిత్యావసర సరకులు తెచ్చి అందించేదని గుర్తు చేసుకున్నారు. వలంటీర్ అందించిన సేవల్ని మరిచిపోలేమని సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ చైతన్యరాణి

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ సీఈఓ ఎస్.చైతన్యరాణి మాట్లాడుతూ సైబర్ భద్రతపై పూర్తి పట్టు సాధించడం ద్వారా సైబర్ నేరగాళ్ల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ల వాడకం పెరుగుతున్న ప్రస్తుత సమయంలో సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయన్నారు. మన కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లలోని వ్యక్తిగత సమాచారాన్ని వేరొకరు హ్యాక్ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే సైబర్ భద్రతపై పట్టును సాధించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవి, హెచ్ఓడీ జి.శేషకుమార్ పాల్గొన్నారు.

క్యాష్ డిపాజిట్ తిరిగి చెల్లించాలి


నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య పద్మరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 2021లో చేరిన హాస్టల్ విద్యార్థులకు ఇచ్చిన హామీని అనుసరించి 75 శాతం క్యాష్ డిపాజిట్‌ను తిరిగి చెల్లించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు మంగళవారం వీసీ ఆచార్య కె.పద్మరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై గత ఏడాది జూలైలో ఆందోళన చేపట్టిన సమయంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న ఆచార్య పి.సురేష్‌వర్మ తమ డిమాండ్ మేరకు 75 శాతం క్యాష్ డిపాజిట్‌ని తిరిగి చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రత్నకుమార్ అన్నారు. కానీ ఆ తరువాత కాలయాపన జరగడంతో తాము మళ్లీ సంబంధిత అధికారులను కోరితే ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. రాతపూర్వకంగా ఇచ్చిన హామీని ఇవ్వలేమనడం విడ్డూరంగా ఉందని, ఇప్పటికైనా దీనిపై పునరాలోచన చేసి, అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని వీసీని కోరామన్నారు. లేకుంటే ఆందోళనకు సిద్ధమవుతామన్నారు.

ఇటుకల లోడు ట్రాక్టర్ బోల్తా

కడియం: మండలంలోని కడియపులంక వద్ద జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఇటుకల లోడు ట్రాక్టర్ బోల్తా పడింది. రావులపాలెం వైపు నుంచి వేమగిరి వైపునకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకల లోడుతో ట్రాక్టర్ కడియపులంక పువ్వుల మార్కెట్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపైనే బోల్తా పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో పెద్దగా వాహనాలు హైవేపై రాలేదు. డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ట్రాక్టర్ యజమానులు మరో ట్రాక్టర్‌ను తీసుకువచ్చి రోడ్డుకు అడ్డుగా పడిన ఇటుకలను అందులోకి లోడుచేసి తీసుకుపోయారు. హైవే సిబ్బందికి సమాచారం అందడంతో వారొచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టారు. కాగా ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని కడియం పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- రాష్ట్రంలో పారదర్శకంగా పథకాల అమలు


చినకొండేపూడిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


అనపర్తిలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

సీతానగరం: రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. చినకొండేపూడిలో మంగళవారం గడపగడపకూ మూడోరోజు కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు.

జోరువానలోనూ..

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జోరువానలోనూ ఉదయం 8 నుంచి రాత్రి 7 వరకూ గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆయనతో పాటు అధికారులు, పార్టీ నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ సరికొత్త అధ్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. వివిధ సంక్షేమ పథకాల కింద గ్రామంలోని 6,478 మంది లబ్ధిదారులకు రూ.22.87 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యిందన్నారు.

అన్ని వర్గాలకూ మేలు

సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలకూ మేలు జరిగిందని ఎమ్మెల్యే రాజా అన్నారు. గడపగడపకూ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనే దానికి నిదర్శమన్నారు. ఇందుకూరి లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా తమ కుటుంబానికి రూ.5 లక్షలకు పైగా లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, వైస్ ఎంపీపీ 2 సత్యం మదనబాబు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండురాజు, ముదునూరి ప్రసాదరాజు, పోలినాటి రామచంద్రరావు, ముదునూరి రామకృష్ణంరాజు, యర్రంశెట్టి బాబులు, మేడిశెట్టి చిన్నికృష్ణ, చిడిపి బంగారయ్య, సూరపరెడ్డి రామకృష్ణ, బచ్చు మురార్జీ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పారదర్శక పాలన

అనపర్తి: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పాతవూరు బోనస్ వీధి, టీటీడీ కల్యాణ మండపం వీధుల్లో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. మహిళలు ఎమ్మెల్యేకు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థలతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వారాకుమారి, రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, ఎంపీటీసీలు ఏడుకొండలు, కొండేటి భీమేష్, పంచాయతీ వార్డు సభ్యుడు యాసిడ్ రాము, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేయడమే ధ్యేయం


ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


కృష్ణునిపాలెంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


రంగంపేటలో లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు


అనపర్తి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి న్యాయం చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని రామవరం గ్రామ సచివాలయం-2 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సాంకేతిక కారణాలతో సంక్షేమ ఫలాలు అందని అర్హులను గుర్తించి వారికి న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. తనపై రామవరం ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనని, గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. దరఖాస్తుదారులకు మంజూరైన ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని గ్రామ ప్రజల తరఫున పంచాయతీ కార్యదర్శులు పీవీవీ కృష్ణారెడ్డి, రామ్మోహన్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, తహసీల్దార్ సరస్వతి, ఈఓపీఆర్డీ పద్మజ, పార్టీ మండల అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సురక్షతో ప్రభుత్వ సేవలు మరింత చేరువ : ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టడం జరిగిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. కృష్ణునిపాలెం, తంటికొండ గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంజూరైన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, సర్పంచ్‌లు రౌతు ఆదిలక్ష్మి, బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ, తంటికొండ దేవస్థానం చైర్మన్ కర్రి రాంబాబు(రెడ్డి), నాయకులు రౌతు జోగేశ్వరరావు, బద్దిరెడ్డి అప్పన్నదొర, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తుర్రం సత్యవతి పాల్గొన్నారు.


అర్హుల ముంగిటకే ధ్రువపత్రాలు

రంగంపేట: ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా జగనన్న సురక్ష ద్వారా స్వగ్రామంలోనే ఉచితంగా అందజేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. మంగళవారం రంగంపేటలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పొలాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య పాల్గొన్నారు.


పైన గ్రామంలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్

పెదపూడి: ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ అన్నారు. పైన గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో 540 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరపల్లి ప్రమీల, తహసీల్దార్ టి.సుభాష్, ఈఓపీఆర్డీ మన్యం శ్రీనివాసు చౌదరి, ఎంపీటీసీ సభ్యుడు సుందరపల్లి సుధాకర్‌బాబు, సుందరపల్లి వీరభద్రరావు, దంగేటి దుర్గారావు, మాజీ సర్పంచ్ కట్టా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పేదలందరికీ నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు చేరాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరి ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం పందలపాకలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పోసిబాబు, ఈవోపీఆర్డీ భవాని, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చా పాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిల్లంకలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

ప్రజల ముంగిటకే పాలన

మధురపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ, మునగాల గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. మునగాలలో 955 మందికి, కోరుకొండలో 1,214 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

సీతానగరంలో మండలంలో..

సీతానగరం: రఘుదేవపురం1లో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు, బొబ్బిల్లంక1లో ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. అనంతరం ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్‌లు ఇందుగుమిల్లి చంద్రలీల, మెల్లిమి రామచంద్రరావు, ఎంపీటీసీలు యలమాటి శిరీష, పంతుల వెంకటరమణ, మల్లిన చౌదరి పాల్గొన్నారు.

ఉత్తరాల బట్వాడాలో పారదర్శకత

ప్రకాశం నగర్: తపాలా కార్యాలయాల్లో ఉత్తరాల బట్వాడాలో మరింత పారదర్శకత అందించే ఉద్దేశంతో మెయిల్ మానిటరింగ్ యూనిట్ (ఎంఎంయూ)ను స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ కె.శ్రీధరం మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ఎంఎంయూను ప్రారంభించామన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులకు ఇంపోర్టు అండ్ ఎక్స్‌పోర్టు లైసెన్స్ కోడ్ కలిగిన సంస్థలు ముఖ్య నగరాల్లోని హెడ్ పోస్టాఫీసుల్లో ఏర్పాటు చేసిన డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాల ద్వారా వస్తువులు, మందులు, గిఫ్ట్‌లు, ఇతర సామగ్రిని పంపవచ్చన్నారు. ఈ కేంద్రాల్లో ముందుగా రిజిస్టర్ చేసుకుని, ఇంటి వద్ద నుంచే సులభ రీతిలో, శ్రమ లేకుండా విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 85005 90045 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.శ్రీనివాసరావు, పోస్ట్ మాస్టర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

21 కేజీల గంజాయి స్వాధీనం

ధవళేశ్వరం: విశాఖ ఏజెన్సీ నుంచి ధవళేశ్వరం తీసుకువచ్చి విక్రయిస్తున్న 21.600 కేజీల గంజాయిని మంగళవారం ధవళేశ్వరం పోలీసులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారయ్యాడు. వివరాలు ఇలా.. పది రోజుల క్రితం విశాఖ నుంచి నలుగురు వ్యక్తులు 25 కేజీల గంజాయిని ధవళేశ్వరం తీసుకువచ్చారు. చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.200 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం చెరుకూరి గార్డెన్స్ సమీపంలో దాచిన గంజాయిని నలుగురు నిందితులు పంచుకుంటుండగా ధవళేశ్వరం పోలీసులు దాడి చేశారు. ఎం.ధర్మరాజు కుమార్, ఎం.సూర్యకిరణ్, ఎండీ జమీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు టి.దొరయ్య పరారయ్యాడు. కేసును సీఐ కె.మంగాదేవి దర్యాప్తు చేస్తున్నారు.